## క్లుప్తంగా

### గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందిస్తున్న దాత

బలిజిపేట: మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయానికి ప్రముఖ విద్యా వేత్త, తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన జి.అప్పలనాయుడు పుస్తకాలను వితరణగా అందించారు. గ్రంథాలయాన్ని విజ్ఞాన భాండాగారంగా తయారుచేయాలని అవసరమైన సహకారం అందిస్తామని దాత ఈ సందర్భంగా చెప్పినట్లు గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు తెలిపారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

### నేడు సచివాలయం ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆర్బీకే

బలిజిపేట: మండలంలోని నూకలవాడలో నిర్మాణాలు పూర్తయిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, నూకలవాడ రోడ్డును ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవాల అనంతరం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ రూనీస్ తెలిపారు. నాయకులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### పి.చాకరాపల్లిలో క్రాస్ ప్రోగ్రాం



గ్రామంలో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని పి.చాకరాపల్లిలో గురువారం బోర్లకు మరమ్మతులు చేపట్టారు. బోర్లు మరమ్మతుల బారిన పడడంతో ప్రజలు నీటికి ఇబ్బందులు ఎదుర్కోగా సర్పంచ్ మోహనరావు ఇచ్చిన సమాచారం మేర క్రాస్ ప్రోగ్రాం ఏర్పాటుచేసి బోర్లకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఈదురుగాలికి పడిపోయిన వరిచేను



లక్ష్మీపురంలో పడిపోయిన వరి చేను

సీతానగరం: మండలంలో రబీవరిచేను పంట కోత దశకు వచ్చే సమయంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలికి పొలాల్లోని వరిచేను పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస, బుడ్డిపేట, వెంకటాపురం, పెదంకలాం, బూర్జ గ్రామాల్లో రైతులు రబీవరి సాగు చేశారు. పంటపక్వదశకు వస్తున్న సమయంలో వడగళ్ల వాన, ఈదురుగాలి వీయడంతో పంట నేలమట్టం కావడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు శంకరరావు, గణేష్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సాలూరులో మినీ మహానాడు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సాలూరు: పట్టణంలో టీడీపీ మినీ మహానాడు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, కళా వెంకటరావు, తదితరులు హాజరై భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జి.సంధ్యారాణి మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మోటార్ వాహనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని శాసనసభ్యుడు అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు (రెట్రో ఫిట్టెడ్ మోటార్ త్రీ వీలర్స్) మోటార్ వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మోటార్ వాహనాల సహాయంతో వ్యాపారం చేసుకుని స్వయం ఉపాధితో జీవన ప్రమాణాలు పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం వారిలో ఆత్మస్థైర్యం నింపుతోందన్నారు. అనంతరం నియోజక వర్గంలోని అర్హులైన పది మంది విభిన్న ప్రతిభావంతులకు మోటార్ వాహనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకురాలు కె.కవిత, ఎంపీపీ కె.విజయ లక్ష్మి, ఎంపీడీఓ మజ్జి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

**మంచినీటి వెతలు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు**

పార్వతీపురం పురపాలక సంఘానికి సంబంధించి గ్రామ దేవత పండగ సందర్భంగా నీటి సరఫరా సమస్యను అరికట్టడానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కలుగుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయం దృష్ట్యా పట్టణంలో నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తగా బూస్టర్ పంపు హౌస్, తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద 3 జనరేటర్లు అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు తగుచర్యలు తీసుకున్నామన్నారు. అలాగే నీటి సరఫరా లేని ప్రదేశాల్లో ప్రస్తుతం నీటి సరఫరా చేస్తున్న పురపాలక సంఘ నీటి సరఫరా ట్యాంకులకు అదనంగా మరో 3 ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లు అద్దె ప్రాతిపదికన తీసుకుని నీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పట్టణ నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలిగినా బి. అప్పలరాజు, నీటి సరఫరా వార్డు ఇన్‌చార్జ్- 7981843975, జి.రామభద్రరాజు నీటి సరఫరా వార్డు ఇన్‌చార్జ్ (అవుట్ సోర్సింగ్) - 9949976823 సి) జి.కల్యాణ్-వాటర్ ట్యాంకర్ డ్రైవర్ 7076886040.) కె.భాస్కరరావు, వాటర్ ట్యాంకర్ డ్రైవర్ (అవుట్‌సోర్సింగ్) - 9492592537లకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

**మోహన్ సుధీర్ సేవలు ఎనలేనివి**

పార్వతీపురం మండలం, అడ్డాపుశీల గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో స్వచ్ఛంద సేవకుడు, ఎన్ఆర్ఐ మోహన్ సుధీర్ పట్టా గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామాభివృద్ధిలో తన వంతు సహాయంగా నిలుస్తూ ప్రజల మనసుల్లో నిలిచిపోయారు. ఆయన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే జోగారావు ప్రశంసించారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఎవరి కాళ్లపై వారు నిలబడేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అక్కేన సుందరం నాయుడు, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ కృష్ణ, గ్రామ పెద్దలు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు

# ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సంక్షేమపథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి పనులు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు పార్వతీపురం నియోజకవర్గంలో జరుగుతున్న గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలంలోని అవాలవలస, బూర్జ గ్రామాల్లో సర్పంచ్ జి దాసు,ఎంపీటీసీ జి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ బూర్జ, ఆవాలవలస గ్రామాల ప్రజలకు మంచినీటి పథకాలు మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలతో లబ్ధిపొందుతున్న ప్రజలు 2024వ సంవత్సరంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాలు పొందడానికి అర్హతఉన్నా నేటికీ అందుకోలేకపోతున్న వారి జాబితాలను సేకరించి పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఉపాధిహామీ పథకం ఏపీఎం రెడ్డి శ్రీరాములు, ఏఈ పవన్‌కుమార్, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, పరవాడ అచ్యుతరావు, టి వెంకటప్పలనాయుడు, వెంపలి గుర్రాజు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పలుగ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, వైద్యారోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై ఆరా..



పనుల ప్రగతిపై ఆరా తీస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పీఆర్ ప్రాజెక్ట్ డీఈ శర్మ మంత్రిని సాలూరులోని ఆయన స్వగృహంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా శాఖాపరంగా జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరా తీశారు. పాచిపెంట మండలంలోని వేటగానివలస - తంగ్లాం రోడ్డుకు సంబంధించి అటవీశాఖ అనుమతులు వచ్చినప్పటికీ పరిపాలనా అనుమతులు కోసం వేచి చూస్తున్నామని డీఈ తెలపగా.. అనుమతులు ఆలస్యం కావడానికి గల కారణాలేమిటని రాజన్నదొర అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత శాఖ రాష్ట్ర అధికారులతో మాట్లాడి అనుమతులు త్వరితగా మంజూరు చేయాలని ఉపముఖ్యమంత్రిని ఆదేశించారు.

# బిల్లులన్నీ చెల్లించాం..

• ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మున్సిపాలిటిలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిగాయని, ఒక్కపైసా కూడా పెండింగ్ లేదని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని వెలమపేట కల్యాణ మంటపం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మున్సిపాలిటీలో 14, 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, గడప గడపకు మన ప్రభుత్వం, స్టేట్ ఫైనాన్స్ గ్రాంట్, తదితర నిధులతో ఇప్పటివరకు చేపట్టిన 26 పనులకు గాను సుమారు 186 లక్షల రూపాయలు చెల్లించామన్నారు. మున్సిపాలిటీకి కొత్తగా మంజూరైన పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించినట్లు చెప్పారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మంచి పేరు తెచ్చుకోవాల్సిన అవసరం స్థానిక కౌన్సిలర్లపై ఉందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతి పైసా చెల్లిస్తామని, ఇందుకు తాను, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బాధ్యత తీసుకుంటామన్నారు. నెలాఖరులోగా పనులు చేయడానికి ఎవరైనా ముందుకు రాకపోతే టెండర్ల ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్లచే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

## టీబీ రోగులకు పోషకాహార కిట్స్ పంపిణీ



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో దాతల ద్వారా నిధులు సేకరించి, వాటితో పోషకాహార కిట్స్ వ్యాధి గ్రస్తులకు పంపిణీ చేశామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎ.శ్యామ్‌కుమార్ తెలిపారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డీఎంహెచ్ఓ ఆఫీసులో టీబీ వ్యాధి గ్రస్తులు, సిబ్బందితో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, పరిసర ప్రాంతాల్లో 40 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు దాతల సహాయంతో పోషకాహార కిట్స్(గుడ్లు, కందిపప్పు, నూనె, పప్పు చక్కీలు) పంపిణీ చేసి టీబీ వ్యాధిపై అవగాహన కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా. డి. భాస్కరరావు, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ విష్ణు డీఎంహెచ్ఓ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన గురువారం రోజున పలు ప్రాంతాలనుంచి వచ్చిన వందలాది మంది భక్తులతో ఆలయ అర్చకుడు స్వామివారికి పూజలు చేయించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

## గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించాలి



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు మన్మథరావు, జి.వెంకటరమణ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిరంతరం విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వై.మన్మథరావు, జి.వెంకటరమణ కోరారు. ఈ మేరకు గురువారం గ్రీన్‌అంబాసిడర్లు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణ చేస్తూ పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం నిరంతరం గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. గ్రీన్‌అంబాసిడర్లకు గ్రామ పంచాయతీల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. స్వచ్ఛభారత్ పథకం ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే చెత్త సేకరించే వాహనాలు శిథిలమవడంతో ఇబ్బందులు పడుతున్నామని, కొత్త వాహనాలను సమకూర్చాలని కోరారు. ఇంతవరకూ చెల్లించవలసిన బకాయి వేతనాలు చెల్లించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో మండల గ్రీన్‌అంబాసిడర్ల సంఘం కార్యదర్శి గౌరి, సీపీఎం మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వేతనదారులు సమయ పాలనపాటించాలి




మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం వేతనదారులు సమయపాలన పాటించి నిర్దేశించిన వేతనాలు పొందాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని కాశీపేట సుడిచెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి పనులు చేపట్టడానికి వాతావరణం అనుకూలించడం వల్ల వేతనదారులు సమయ పాలన పాటిస్తూ నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని నిర్ధారించామన్నారు. ఇప్పటికే పలుగ్రామాల్లో ఉపాధి బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని తెలియజేశారు. గోర్జలు, రోడ్డు కల్వర్టులు, చెరువుల అభివృద్ధి పనులు చేయాలని కోరారు. కాశీపేటలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి చెరువులో తీసిన మట్టిని అవసరానికి అనుగుణంగా గట్లపై వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలపై అవగాహన కలిగించాలి




శిక్షణలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

• డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: సమగ్రమైన, సురక్షిత గర్భనిరోధక, గర్భస్రావం పద్ధతులు, నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం జిల్లా ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సవరణలను అనుసరించి సురక్షితమైన గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతులను పాటించాలని, నిబంధనల మేరకే నిర్వహించాలని, అర్హులైన, ఆమోదం పొందిన వైద్యుల ద్వారా మాత్రమే జరగాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో మారుమూల గ్రామాలు ఎక్కువగా ఉండడం వల్ల ఈ నిబంధనపై ప్రజల్లో మరింతగా అవగాహన కలిగించాలని సూచించారు. అర్హులైన వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల షాపుల్లో గర్భ నిరోధక మాత్రలు ఇవ్వరాదని అటువంటి వారిని గుర్తిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంఛిత గర్భం దాల్చిన వారిని గుర్తించినా లేదా వారే స్వయంగా వైద్య సిబ్బందిని సంప్రదించినా వారికి సురక్షిత పద్ధతులపై అవగాహన కల్పించాలని, ఆస్పత్రిలో ప్రసవం శ్రేయస్కరమని వివరించాలని స్పష్టం చేశారు. వారి వివరాలు గోప్యంగా ఉంచాలని చెప్పారు.

**నైపుణ్యం లేని పద్ధతులతో మరణం**

ఈ శిక్షణ ద్వారా వైద్యాధికారులు నైపుణ్యం పొంది సురక్షిత గర్భనిరోధక, గర్భస్రావం పద్ధతులపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ వాగ్దేవి మాట్లాడుతూ అవాంఛిత గర్భాన్ని తొలగించుకోవాలనే క్రమంలో నైపుణ్యం లేని, సురక్షితం కాని పద్ధతుల ద్వారా తీవ్రమైన రక్త స్రావం జరగడం, ఇన్ఫెక్షన్లు సోకడం ద్వారా మరణానికి దారితీస్తుందని ఆస్పత్రిలో ప్రసవం శ్రేయస్కరమని నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమ నోడల్ అధికారి డీఐఓ టి.జగన్ మోహనరావు మాట్లాడుతూ వైద్యాధికారులను నాలుగు బ్యాచ్‌లుగా వేశామని, ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె ప్రాజెక్ట్ అధికారి ధవళ.భాస్కరరావు, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, సిబ్బంది జయగౌడ్ పాల్గొన్నారు.

## చెట్టు విరిగిపడి రాకపోకలకు అంతరాయం



రహదారిపై పడిన చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు

సీతానగరం: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షం, ఈదురుగాలి కారణంగా లచ్చయ్యపేట వద్ద రాష్ట్రరహదారిపై చెట్టు విరిగి పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ క్లియరెన్స్ చేయడానికి స్థానికులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించడంతో రాకపోకలు పునరుద్ధరించారు. అలాగే రెడ్డివానివలసలో పాలసేకరణ కేంద్రం సమీపంలో విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు గాలికి పడి పోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

పార్వతీపురంటౌన్: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో 3 గంటలపాటు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఏఈ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ పార్వతీపురం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ మెయింటనెన్స్ వర్క్ జరుగుతున్న కారణంగా అర్బన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.చిరంజీవి అన్నారు. అట్టలి గ్రామంలో సర్పంచ్ కె.సంధ్యారాణి పర్యవేక్షణలో వైఎస్సార్ కంటి వెలుగు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు ఇచ్చారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలతో పాటు మందులు అందజేశారు.